క్లుప్తంగా

1న గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశాలు

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలో ఆగస్టు 1వ తేదీ శుక్రవారం ఉదయం గోగుల్లంక, జిమూలపాలెం, మధ్యాహ్నం 2 గంటలకు జి.వేమవరం, సాయంత్రం 4 గంటలకు గుత్తెనదీవిలో నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులు

యానాం: పుదుచ్చేరి మురుంగపాకం స్విమ్మింగ్ సెంటర్‌లో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 10వ జూనియర్ అండ్ సబ్ జూనియర్ అండర్–10 స్విమ్మింగ్ పోటీలు–2025లో డాక్టర్ వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలోని యానాం స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) అకాడమీ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి 44 పతకాలను కైవసం చేసుకున్నారు. ఇందులో 15 బంగారు, 21 రజత, 8 కాంస్య పతకాలు ఉన్నాయని మంగళవారం ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్, కోచ్ రవితేజ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ

ముమ్మిడివరం: ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న కత్రివానిరేవు మాజీ సర్పంచ్ మోర్త శ్రీరామచంద్ర మూర్తిని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణతోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడిప్రవీణ్‌కుమార్, కోలా బాబ్జీ, నాయకులు చింతా నాగమునీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసిన వారు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ పి.రవివర్మ సూచించారు. నగర పంచాయతీ పరిధిలో ఈ ఏడాది జూన్ 30వ తేదీ ముందు ఎవరైనా అనధికార లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ఉంటే క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం మార్కెట్ వాల్యూ ప్రకారం చార్జీలు చెల్లించి స్థలములను క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ సూచించారు.

ప్రణాళికాబద్ధంగా సమస్యల పరిష్కారం

యానాం: మున్సిపాలిటీ పరిధిలో వివిధ సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు కమిషనర్, ట్రైనీ ఐఏఎస్ అధికారి బుద్ధి అఖిల్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే మున్సిపల్ సిబ్బంది రెగ్యులర్ అటెండెన్స్, సమయపాలన మెయింటినెన్స్ చేయాలని ఇచ్చిన ఆదేశాలు అమలవుతున్నాయని తెలిపారు. హెచ్ఆర్ స్క్వేర్ సంస్థతో మున్సిపాలిటీ చేసుకున్న అగ్రిమెంట్ వివరాలను మున్సిపాలిటీ సిబ్బంది తెలియజేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య సమస్యపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలిపారు.

బాలికపై లైంగిక దాడి అమానుషం

అమలాపురం టౌన్: రాయవరం మండలం మాచవరంలో ప్రైవేటు స్కూల్లో చదువుతున్న బాలికపై కరస్పాండెంట్ జయరాజు లైంగిక దాడి చేయడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. అమలాపురంలోని ఎస్ఎఫ్ఐ కార్యాయంలో జిల్లా కమిటీ కన్వీనర్ కె.శంకర్ తదితరులు మంగళవారం నిర్వహించిన అత్యసర సమావేశంలో మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. కరస్పాండెంట్‌ను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించడంతోపాటు ఆ స్కూల్‌ను అధికారులు సీజ్ చేయాలని జిల్లా కన్వీనర్ శంకర్ డిమాండ్ చేశారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

అమలాపురం రూరల్: పేరూరు పంచాయతీ పరిధిలో నాలుగు సచివాలయాల్లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సర్పంచ్ దాసరి అరుణాడేవిడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వచ్చిన ఉద్యోగులను అందరికీ పరిచయం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి ఆర్ఎస్ఎస్ సూరపరాజు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోసం చంద్రబాబు నైజం

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- తాడికోనలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' సమావేశం



తాడికోన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని, ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతి సారీ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ విమర్శించారు. అల్లవరం మండలం తాడికోన, గూడాల, కోడూరుపాడులో మంగళవారం 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.

అమలుకు నోచుకోని సూపర్ సిక్స్ పథకాలు

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారం కోసం సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 14 నెలలు పూర్తయినా పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి నేటికి ఒకటి మాత్రమే ఇచ్చారని ఎద్దేవా చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ. 20 వేలు ప్రకటించారని, నేటికీ ఈ పథకంలో ఒక్క రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఊసే లేదని విమర్శించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళలకు నెలలకి రూ.1,500 ఇస్తామని ప్రకటించారు. నేటికీ ఈ పథకంలో ఒక్కరికి కూడా డబ్బులు ఇవ్వలేదన్నారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారో చెప్పాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తల్లి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి రూ. 15 వేలు చొప్పున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం తీరా డబ్బులు వేసే సరికి రూ. 13 వేలు చొప్పున వేసారని, కొంతమందికి అయితే రూ. 7 వేలు, రూ. 8 వేలు వేశారన్నారు. ఈ పథకంలో విద్యార్థులను నిలువునా మోసం చేశారని, ప్రభుత్వ మోసాన్ని ప్రజలు గుర్తించి కూటమి నేతలను నిలదీయాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు నాతి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, ఉండ్రు వెంకటేష్, తిక్కా ప్రసాదు, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, దాకారపు చిరంజీవిరావు, పల్లి జేమ్స్, ఉండ్రు బాబ్జి, బళ్ల శ్యామ్, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు శిరంగు వీరబాబు, ముత్తాబత్తుల సంతోష్, జల్లి శ్రీను, బొంతు కృష్ణమూర్తి, పేరి శ్రీను, కలగట వెంకటేశ్వరరావు, దాసరి బాలాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో నయవంచన



చొల్లంగి సమావేశంలో క్యూఆర్ కోడ్ పోస్టర్లను చూపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చొల్లంగి, జి.వేమవరంలో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమం

తాళ్లరేవు: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు మోసాలే మిగిలాయి తప్ప, ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మంగళవారం చొల్లంగి, జి.వేమవరం గ్రామ పంచాయతీల పరిధిలో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. చొల్లంగిలో పార్టీ సీనియర్ నాయకులు బూరెల వెంకట్రాజు కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. పార్టీ పరిశీలకుడు మాతా మురళి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్, నాయకులు బూరెల వెంకట్రాజు, అంకాడి అంజిబాబు, కాలా వెంకటరమణ, దడాల జగదీశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందన్నారు. చంద్రబాబు మోసాలను గ్రామస్థాయిలో కార్యకర్తలు ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొపనాతి నాగరాజు, కొరుకొండ కిరణ్‌కుమారి, బొంతు మోహన్, నీలపాల శ్రీను, యర్రంనీడి అప్పారావు, మట్టా లింగమూర్తి, కాశి లక్ష్మణస్వామి, పోతుల రత్నకుమారి, వెంటపల్లి సూకరాజు, పంపన రామకృష్ణ, పెట్ల సూర్యనారాయణరాజు, రేకాడి నరసింహమూర్తి, వరిపల్లి శివాజీగణేష్, పేర్ని ఆదినారాయణ మూర్తి, శ్రీపాదం శ్రీనివాస్, రేవు నాగేశ్వరరావు, మోకా మధుబాబు, దవులూరి శ్రీరామ్మూర్తి, అనిశెట్టి శ్రీనివాసరెడ్డి, మాసా శ్రీనివాస్, పందిరిపల్లి రాజేష్, గునిపే విష్ణు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి వేగవంతం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ అధికారులు

యానాం: బంగాళాఖాతంలో వివిధ చమురు సంస్థలు చమురును అన్వేషిస్తూ తీరప్రాంత గ్రామాల్లో ఆన్‌షోర్ టెర్మినల్స్ వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్లను స్థాపించాయని, కాలుష్యబారిన పడుతున్న సమీప గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) సామాజిక బాధ్యతగా నిధులు మంజూరు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని రిటైర్డ్ ఆర్ఏఓ, డిప్యూటీ డైరెక్టర్ కమ్ అండర్ సెక్రటరీ (ఎల్ఏడీ) గిడ్డి బలరామ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సర్కిల్ ది యానాం భవనంలో ఆయన రచించిన సీఎస్ఆర్ విధి విధానాలు పుస్తకాన్ని యానాం ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు, సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో రచయిత బలరామ్ మాట్లాడుతూ నష్టపరిహారం అందించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో విద్య, వైద్యం, పారిశుధ్యం వంటి అంశాలపై చమురు సంస్థలు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్ఏఓ నామాడి అప్పారావు, రిటైర్డ్ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు హుస్సేన్, కామిశెట్టి వేణుగోపాలరావు, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పండు సిద్ధార్థ, వ్యవసాయ కార్మిక సంఘ నేత టేకుమూడి ఈశ్వరరావు, గుత్తుల రామారావు, గోపీ సురేష్, గుర్రపు ప్రహ్లాదుడు, తిరుకోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి



ఎస్.కొత్తపల్లిలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు మోస పూరిత హామీలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ, ఆయా విభాగాల కార్యవర్గ సభ్యులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్‌ను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, బొడ్డు నాగేశ్వరరావు (బుజ్జి), సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, జొన్నాడ శ్రీదుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షుడు చీకట్ల కిషోర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, పార్టీ జిల్లా కార్యదర్శులు బడుగు మేరీకుమారి, పొగాకు శ్రీను, నిమ్మకాయల హనుమంతు శ్రీనువాసరావు, బీసీ, ఎస్సీ సెల్ విభాగాల మండల అధ్యక్షులు యనమదల పల్లంరాజు, పోతుమూడి కొండబాబు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, పార్టీ నాయకులు అంగాని సాంబశివరావు, నడింపల్లి వాసురాజు, నల్లా నాయుడు, కొంకి బాలకృష్ణ, మోటూరి సత్యంకాపు, చీకట్ల రెడ్డినాయుడు, కోడి పట్టాభి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు

అమలాపురం టౌన్: ఇళ్లకు బలవంతంగా బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలిగించి ఈ వ్యవస్థనే రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని ఆపాలని డిమాండ్ చేస్తూ ప్రజా వేదిక ఆధ్వర్యంలో అమలాపురంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం పెరిగిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల బలవంతపు బిగింపులపై చర్చించింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ప్రతినిధులు పాల్గొని విద్యుత్ బిల్లులు, స్మార్ట్ మీటర్లపై ధ్వజమెత్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన కూటమి పార్టీల నాయకులు ఇప్పుడు అధికారం చేపట్టాక ఆ మాటలు మరిచారని చెప్పారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని పిలుపునిచ్చారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాట తప్పి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యుత్ చార్జీలను పెంచిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధమయ్యాయని ధ్వజమెత్తారు.

5న ధర్నాలు: పెరిగిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల బలవంతపు బిగింపులను నిరసిస్తూ ఆగస్టు 5న జిల్లాలోని అమలాపురం, కొత్తపేట, రాజోలు, కొత్తపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు చేసేందుకు సమావేశంలో ప్రజావేదిక తీర్మానించింది. జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాశంశెట్టి సత్తిరాజుతోపాటు పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పీతల రామచంద్రరావు, నిమ్మకాయల శ్రీనివాసరావు, ఊటాల వెంకటేష్, గూడాల రమణ, పి.మురళీకృష్ణ, కె.భాస్కరరావు తదితరులు విద్యుత్ ఛార్జీల దోపిడీపై ధ్వజమెత్తారు.

అభివృద్ధి పనులు ప్రారంభించండి



మున్సిపల్ కమిషనర్ అఖిల్‌ను సత్కరించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు, ఆది ద్రావిడ, నామినేటెడ్ ఎమ్మెల్యేల నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించ లేదని, వెంటనే ఈ అంశంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్‌ను కోరారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో అఖిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నిలిచిపోవడం వల్ల నిధులు వెనుకకు వెళ్లే అవకాశాలున్నాయని, తక్షణం అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది వేతన బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా యూపీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఉప్పలగుప్తం: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యూపీఎఫ్) మూడవ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఉప్పలగుప్తంలోని ఇస్సాకు ఫౌండేషన్ ప్రార్థనా శక్తి ఎస్టేట్‌లో ఘనంగా నిర్వహించారు. యూపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, మన్నా మినిస్ట్రీస్ అధినేత రెవ.కారల్ డేవిడ్ కోమానపల్లి అధ్యక్షతన వహించారు. జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫౌండేషన్ అధినేత రెవ.చిక్కం ఇస్సాను కార్యవర్గ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో యూపీఎఫ్ జిల్లా కార్యదర్శి రెవ. యెహోషువ, జిల్లా ఉపాధ్యక్షుడు విక్టర్ నందా, తాతపూడి ఎర్నెస్ట్, భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు చిక్కం దానియేలు, సంయుక్త కార్యదర్శి పిన్ని అబ్రహం, కోశాధికారి ఇమ్మానుయేలు, పాస్టర్లు పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన అవసరం



డ్రోన్ల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, అధికారులు

అమలాపురం టౌన్: అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే పాఠశాలల్లో స్పేస్ స్కిల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సైన్స్ సిటీ సీఈవో ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్పేస్ స్కిల్ విజ్ఞాన శిబిరంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎమెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. డీవైఈవో జి.సూర్యప్రకాశం మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సర్వ శిక్షాభియాన్ – ముస్కాన్ సంయుక్తంగా స్పేస్ స్కిల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. శాస్త్రవేత్త సీవీ రామన్ 3డీ విగ్రహాన్ని ప్రతి శాస్త్రోత్సవ ప్రదర్శనల్లో ఏర్పాటు చేయాలని కోరుతూ కంభంపాటి హరిసూర్యనారాయణ రూ.20 వేల విరాళాన్ని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యానికి అందజేశారు. సైన్స్ సిటీ స్టేట్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, సర్వ శిక్షాభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. మమ్మీ, ముస్కాన్ సీఈవో ప్రణేష్‌దేబ్‌నాథ్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.హనుమంతరావు, జిల్లా సర్వశిక్షాభియాన్ సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు బెహరా సత్యనారాయణమూర్తి, హెచ్ఎం భమిడిపాటి రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది దేవస్థాన భూముల రీసర్వే వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేస్తామని జేసీ టీ నిషాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి, దేవాదాయ శాఖ అధికారులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులతో కలసి రీ–సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేవస్థాన భూముల రీ–సర్వే ఆలస్యం కావడంపై భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని వేగవం చేయాలని అధికారులకు సూచించారు. కేశవదాసుపాలెం, అంతర్వేది, శృంగవరపాడు, గొంది గ్రామాల్లో 895 ఎకరాల భూమి దేవస్థానానికి చెందినదని చెప్పారు. ఇందులో 726 ఎకరాలు కొబ్బరి తోటలు, ఆక్వా చెరువులు, వ్యవసాయ భూములుగా ఉండి వివిధ రకాల అద్దెలు, లీజుల ద్వారా ఆదాయం లభిస్తోందని దేవస్థానం ఈవో వెల్లడించినట్లు ఆమె పేర్కొన్నారు. మిగిలిన 139 ఎకరాలు దేవస్థానం ప్రత్యక్ష ఆధీనంలో ఉన్నాయని తెలిపారు.ఈ భూముల్లో 500 ఎకరాల పరిధిలో రీ–సర్వే ఇంకా పెండింగ్‌లో ఉందని చెప్పారు. దేవస్థాన అధికారులతో కలసి అద్దెలు, లీజుల చెల్లింపుల అంశాలపై జేసీ సమీక్షించారు. ఆగస్టు 5న నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి సమగ్ర నివేదికలతో అధికారులు హాజరు కావాలని ఆమె ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్ఓ రాజకుమారి, ఆర్డీవో కె. మాధవి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ, సర్వే ఏడీప కె. ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పరిశ్రమలో అధికారుల తనిఖీ

అమలాపురం రూరల్: మండలంలో నడిపూడిలోని నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి తయారు చేస్తున్న ఓ పరిశ్రమపై పర్యావరణ అధికారులు మంగళవారం దాడి చేశారు. నడిపూడిలోని వరలక్ష్మి ఇండస్ట్రీస్‌కు చెందిన పరిశ్రమలో ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తయారు చేస్తునట్లు సమాచారం అందడంతో కలెక్టర్ ఆదేశాలతో కాకినాడ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చెందిన అసిస్టెంట్ పర్యావరణ ఇంజినీర్ బి.ప్రణతి, అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, నడిపూడి పంచాయతీ కార్యదర్శి బి.అనంతలక్ష్మి తదితరులు వరలక్ష్మి పరిశ్రమలో తనిఖీ చేశారు. ఈ పరిశ్రమలో ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిల్ ఇతర ప్లాస్టిక్ వస్తువులు తయారు చేసినట్లు గుర్తించారు. మూడు టన్నుల ప్లాస్టిక్‌ను గుర్తించి సీజ్ చేసి రూ. 50 వేలు అపరాధ రుసుం విధించినట్లు అసిస్టెంట్ పర్యావరణ ఇంజినీర్ తెలిపారు. ప్లాస్టిక్ ఉత్పత్తులు తయారు చేయవద్దని పరిశ్రమ యజమానులు గొలకోటి మంగతాయారు, బసవ సత్య వెంకట సుబ్బారావును ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ అమలాపురం మండల కమిటీ నియామకం

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అమలాపురం రూరల్ మండల పార్టీ కమిటీని కేంద్ర కార్యాలయం నియమించింది. ఉపాధ్యక్షుడిగా పానకల గణేష్, బడుగు త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శులుగా మద్దింశెట్టి రాంబాబు, దూనబోయిన రవికుమార్, కొప్పిశెట్టి వెంకట ప్రసాద్, అప్పారి సూరిబాబు, కార్యదర్శులుగా రేవు శ్రీనుబాబు, బడుగు వెంకటరమణ, కడిమి బ్రహ్మాజీ, దొమ్మేటి రాంబాబు, కుడుపూడి నరేష్‌బాబు, కార్యనిర్వాహక సభ్యులుగా నాగాబత్తుల ఏడుకొండలు, కాప రాంబాబు, కూర్మా క్రీస్తుబాబు, వాసంశెట్టి వీర వెంకటసత్యనారాయణ, పొలమూరి మాణిక్యాలరావు, కాట్రు వసంతకుమార్, కుడుపూడి సాయి, కేతా సాయి, బొండాల మహేశ్వరరావు, కె.త్రిమూర్తులు, గోసంగి శ్రీనివాసరావు, కంచే సదా శివుడు, చొల్లంగి రాధాకృష్ణ, అక్కిశెట్టి వెంకటదుర్గాప్రసాద్, కోండ్రు శ్రీకృష్ణ, దొమ్మేటి మోహన్‌కుమార్, చెల్లి లోవరాజు, దొంగ ఆంజనేయులు, బొక్కా సూర్యప్రసాద్, సవితిక పుణ్యవతి, ఇడిసు త్రిమూర్తులు, పితాని బేబీ, జొన్నవిత్తుల అమరనాథ్ రెడ్డి, బొంతు హరి నియమితులయ్యారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా మంగాదేవి

అమలాపురం రూరల్: అమలాపురం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బి.మంగాదేవి బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం ఎంపీడీవోగా పని చేస్తున్న ఉండ్రు బాబ్జీ రాజు నెలరోజులపాటు పరిపాలనాపరమైన శిక్షణ కోసం సామర్లకోట వెళ్లారు. డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న మంగాదేవి ఇక నుంచి అమలాపురం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఆమెను కార్యదర్శులు కలసి అభినందించారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి

యానాం: ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అమలవుతున్న ఉచిత బియ్యం పంపిణీ తదితర వాటికి పథకాలకు రేషన్‌కార్డుదారులు ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని మంగళవారం ఆర్ఏఓ మునిస్వామి ఆదేశించారు. సబ్సిడీలు లబ్ధిదారులకు చేరుతున్నాయో లేదో పర్యవేక్షించడానికి ఈకేవైసీ ప్రక్రియ ప్రభుత్వానికి సహాయ పడుతుందన్నారు. ప్రభుత్వ అనుమతితో ఎలాంటి చార్జీలు లేకుండా సాధారణ సేవా కేంద్రం (సీఎస్‌సీ)లో లబ్ధిదారులు ఈకేవైసీ నిర్ధారణ పూర్తిచేయాలని కోరారు.

బస్ షెల్టర్‌లో వ్యక్తి మృతదేహం

ఐ. పోలవరం: కొమరగిరి బైపాస్ రోడ్డు పక్కన బస్ షెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం (60) లభ్యమైంది. కొమరగిరి వీఆర్వో శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై రవీంద్రబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు ఎస్సై మంగళవారం తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఐ.పోలవరం పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

నిబంధనలు పాటించాలి

అమలాపురం రూరల్: ప్రైవేట్ పాఠశాలు, కాలేజీల యాజమాన్యాలు, వాహనాల డ్రైవర్లు భద్రతా నిబంధనలు పాటించాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. బస్సు డ్రైవర్‌ను నియమించుకునే ముందుగా స్కూల్ యాజమాన్యం తప్పనిసరిగా అతడి డ్రైవింగ్ లైసెన్స్ హిస్టరీ స్థానిక ఆర్‌టీఏ కార్యాలయంలో చెక్ చేయాలని కోరారు. పాఠశాలలు, కాలేజీల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాలకు తప్పనిసరిగా రవాణాశాఖాధికారిని పిలవాలని కోరారు.

సినారెకు ఘన నివాళి

అమలాపురం టౌన్: తెలుగు సాహిత్యంలో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తర్వాత జ్ఞానపీఠ పురస్కారం పొందిన రెండో కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) అని కవులు, రచయితలు అన్నారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రవితేజ జూనియర్ కళాశాలలో డాక్టర్ సినారె 94వ జయంతి సభ మంగళవారం ప్రిన్సిపాల్ కె.దొరబాబు అధ్యక్షతన నిర్వహించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ కవులు, రచయితలు డాక్టర్ సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మంత్రి సుభాష్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

అమలాపురం టౌన్: కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ అనుచరుల దాడికి గురైన దళిత యువకుడు దోనిపాటి మహేష్‌పై మంత్రి అసత్య ఆరోపణలు చేయడాన్ని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, మేరక రమణతోపాటు పలు దళిత సంఘాల ప్రతినిధులు మంగళవారం ఖండించారు. మంత్రి సుభాష్ బాధితుడు మహేష్‌ను ఇప్పటి వరకూ పరామర్శించకపోగా దాడి చేసిన తన అనుచరులను కాపాడేందుకు ప్రయత్నించడం దారుణమని అన్నారు. దాడికి పాల్పడిన వారికి మద్దతుగా మంత్రి మాట్లాడడం తగదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి తక్షణమే తన అనుచరులకు కొమ్ము కాసే ప్రయత్నాన్ని విడనాడి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రమణ తదితరులు డిమాండ్ చేశారు.

దాట్ల దేవదానంరాజుకు రావిశాస్త్రి సాహిత్య పురస్కారం

యానాం: రావిశాస్త్రి సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాదికి యానాంకు చెందిన ప్రముఖ కవి, కలైమామణి దాట్ల దేవదానంరాజుకు అందించనున్నట్టు మంగళవారం రావిశాస్త్రి ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ తెలిపారు. ఈనెల 30న విశాఖ పౌర గ్రంథాలయంలో రసజ్ఞ వేదిక వద్ద నిర్వహించే రావిశాస్త్రి జయంత్యుత్సవంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు, సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు తెలిపారు. ఈ సందర్భంగా దాట్లను పలువురు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి మృతి చెందినట్లు కోరంగి ఏఎస్సై ఏ.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యానాం సావిత్రినగర్ గ్రామానికి చెందిన చింతా శ్రీను(37) కాకినాడ పోర్టులో పనిచేస్తున్నాడు. సావిత్రినగర్ నుంచి కాకినాడకు ద్విచక్ర వాహనంపై బయలుదేరి గ్యాస్ సిలిండర్ తీసుకెళుతుండగా మట్లపాలెం పీచు ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన శ్రీనును స్థానికులు 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి అర్ధాంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు, గ్రామస్తులు కోరంగి పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కారు యజమాని ముందుకు రావడంతో పరిస్థితి చక్కబడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.